అవినీతిలో అటవీ శాఖ

నెల వ్యవధిలో ఆరుగురు అధికారులు సస్పెన్షన్

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): అటవీ శాఖలో అవినీతికి హద్దు లేకుండా పోతోంది. గత నెల రోజుల వ్యవధిలో ఆరుగురు అటవీ శాఖ అధికారుల అవినీతి బయటపడి సస్పెన్షన్‌కు గురికావడ చర్చనీయాంశంగా మారింది. వీరంతా విధుల నిర్వహణలో జరిగిన తప్పిదాలో లేక పొరపాట్ల వల్ల శిక్షకు గురైన వారు కాదు. కావాలని అవినీతికి పాల్పడి ఆ అవినీతి బయటపడడంతో సస్పెండ్ అయిన వారే. వరుసగా అటవీ శాఖలో జరుగుతున్న సంఘటనలు ఆ శాఖ అధికారులను కలవరానికి గురి చేస్తోంది. రెండు నెలల క్రితమే కాగజ్‌నగర్ డివిజన్‌లోని దహెగాంలో రెండు పులులు మరణించిన సంఘటనలో ముగ్గురు అటవీ శాఖ అధికారులు సస్పెండ్ కాగా నెల రోజుల వ్యవధిలో ఆరుగురు అధికారులు సస్పెండ్ అయ్యారు.

కలప స్మగ్లింగ్ సంఘటనలో ఇద్దరు..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జోడేఘాట్ అటవీ రేంజ్ పరిధిలో కలప స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై సెక్షన్ అధికారి వినయ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ఇమ్రాన్ సస్పెండ్ అయ్యారు. ఈ ప్రాంతంలో తరుచుగా కలప అక్రమ రవాణా జరుగుతూ పట్టుబడుతున్న సంఘటనలపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టారు. కలప అక్రమ రవాణలో జోడేఘాట్ రేంజ్‌లో పని చేసే క్షేత్రస్థాయి అధికారుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి బాధ్యులను సెస్పెండ్ చేశారు. ఆ తర్వాత లింగాపూర్ అటవీ గ్రామాల్లో ప్రత్యేకంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. భారీ ఎత్తున కలప, కలప కోసే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

వేటగాళ్ల వద్ద 40 వేలు డిమాండ్ చేసిన ఘటనలో ఇద్దరు...

వాంకిడి మండలం కోమటిగూడ గ్రామానికి చెందిన ఇద్దరి వద్ద రూ.40వేలు లంచం డిమాండ్ చేసిన ఘటనలో రెండు రోజుల క్రితం ఇద్దరు అటవీశాఖ అధికారులు సస్పెండ్ అయ్యారు. కోమటిగూడకు చెందిన వ్యక్తులను అనుమానంతో తనిఖీ చేసిన ఎఫ్ఎస్ఓ అత్రోయిద్దీన్, బీట్ అధికారి మహ్మద్ సాద్‌లకు వారి వద్ద వలలు, ఇతర వైర్లు దొరకడంతో కేసులు పెట్టకుండా ఉండేందుకు రూ.40వేలు డిమాండ్ చేశారు. మధ్యవర్తి ద్వారా రూ.25 వేలు లంచం తీసుకున్నారు. ఈ సంఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎఫ్ఎస్‌వో అత్రోయిద్దీన్, బీట్ అధికారి మహ్మద్ సాద్‌ను సస్పెండ్ చేశారు.

చేయని పనులకు బిల్లులు ఇచ్చిన సంఘటనలో ఇద్దరు..!

అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ పనులకు సంబంధించిన బిల్లులను పనులు చేయకుండా ఇచ్చిన సంఘటనలో కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్ రఘు, సూపరింటెండెంట్ విలాస్ సస్పెండ్ అయ్యారు. అటవీ శాఖ ద్వారా చేపట్టే పనులకు సంబంధించి సుమారు రూ.21 లక్షల బిల్లులను పనులు చేయకుండా ఇచ్చినట్లు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వీరిపై ఆరోపణలు వచ్చాయి. సస్పెన్షన్ తర్వాత నిధులను రికవరీ చేసినట్లు తెలిసింది.

వాంకిడి:బస్ షెల్టర్ లేక చెట్టు నీడలో కూర్చున్న ప్రయాణికులు

బస్ షెల్టర్‌లేక ప్రయాణికుల ఇబ్బందులు

వాంకిడి, మార్చి17: మండలంలోని బంబారలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఉన్న బస్ షెల్టర్ తొలగించారు. దీంతో బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బంబారలో బస్‌షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

ఉచిత శిక్షణ-ఉపాధి

jobs Apply Now!

★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.

NTK-311116

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

వివాహం కావడం లేదని మహిళ ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్, మార్చి 17: బెల్లంపల్లి పట్టణంలోని టేకులబస్తీకి చెందిన కొత్తూరు సుమలత (38) వివాహం కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం బెల్లంపల్లి గంగారాంనగర్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నది. వివాహం కావడం లేదని కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దస్తావేజు లేఖరుల కార్యాలయాలు బంద్

హాజీపూర్, మార్చి 17 : నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని దస్తావేజు లేఖరుల కార్యాలయాలను మధ్యాహ్నం 1 గంట వరకు బంద్ ఉంచుతున్నట్లు దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు దీపక్ ఉపాధ్యాయ ఆదివారం తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆనుకొని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగా తమ కార్యాలయాలను మూసి వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి మధ్యాహ్నం తెరుస్తామని తెలిపారు. భూముల క్రయ విక్రయాలను నిర్వహించే వారు తమ భూముల రిజిస్ట్రేషన్ కోసం మధ్యాహ్నం 1 గంట తర్వాత కార్యాలయానికి రావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లిరూరల్, మార్చి 17: తెలంగాణ సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యాసంవత్సరానికి గానూ 6, 7, 8. 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భరీత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా తమ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 21 న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

రేపు వేలం పాట

చెన్నూర్, మార్చి 17: చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 19న తైబజార్, పశువుల సొంత నిర్వహణ కోసం వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు మున్సిపాలిటీకి ఎలాంటి బకాయిలు లేనట్లు సర్టిఫికెట్‌తో పాల్గొనాలన్నారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం..

- రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- వందల ట్రిప్పుల మేర నిల్వ ఉన్న ఇసుక రాసులు
- డీడీలు లేకున్నా రవాణా
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖ

ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్

పెంచికల్ పేట్, మార్చి 17: ఇష్టారాజ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకాసురులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ డబ్బులు సంపాదించుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, పోలీస్, మైనింగ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆదాయం పెరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ఒక ట్రిప్పుకు డీడీ 1800 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఇట్టి డబ్బులు సంబంధించిన గ్రామ పంచాయతీకి రూ.600 జమ చేస్తారు. మిగతా డబ్బులు రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోతాయి. డీడీ గాని అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అయినా నిబంధనలు పాటించకుండా డీడీ రూపంలో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

పెంచికల్‌పేట్ మండలం పెద్దవాగు, బొక్కి వాగు, ఉచ్చమల్లి వాగులో రోజుకు పదుల సంఖ్యల ట్రాక్టర్లు రాత్రులు పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో ఇసుక ట్రిప్పులను రవాణా చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలకు గురైన పెద్దవాగు

మండలంలో మూడు ఇటుక తయారి కేంద్రాలు, రెండు సిమెంట్ పోల్స్ రింగుల తయారి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క దాని దగ్గర వందల ట్రిప్పుల ఇసుక నిలువలు ఉన్న వాటికి సంబంధించి ఒక డీడీ, అనుమతులు గాని లేకుండానే తరలించారు. అదే విధంగా మండలంలో పలు బిల్డింగ్‌ల కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపడుతున్న వాటికి తరలించే ఇసుక సైతం ఎటువంటి లెక్కలు, అనుమతులు లేవు. ప్రజల నుంచి మాత్రం ఒక్క ట్రిప్పుకు రూ.1500 నుంచి 2వేలు తీసుకుంటున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ రోజుకు 20 నుంచి 30 ట్రిప్పుల ఇసుకను తరలిసున్నారు. గత ఆరు నెలల నుంచి రెవెన్యూ కార్యాలయానికి కనీసం ఇసుక రవాణాకు సంబంధించి ఒక్క డీడీ కూడా అందుబాటు లో లేదని రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. ఈ ఇసుక రవాణా పోలీస్ స్టేషన్ ముందు నుంచి గాని, తహసీల్ కార్యాలయం వెనుక నుంచి గాని జరిగిన కార్యాలయాల దగ్గర ఇసుక నిల్వలు ఉన్న ఇటు రెవెన్యూ అధికారులు అటు పోలీస్ అధికారులు స్పందించడం లేదు. ఈ రెండు, మూడు రోజుల మధ్యలో తహసీల్దార్ ట్రాక్టర్లను పట్టుకొని వదిలిపెట్టినట్టు విశ్వసనీయ సమాచారం. ఇసుక రవాణా చేసే వ్యక్తుల్లో వ్యత్యాసాలు కొందరు వ్యక్తులు తెచ్చుకోవడానికి పెద్దవాగుకు అనుమతి మరికొందరు తీసుకురాకుండా దారికి అడ్డంగా జాలిని ఏర్పాటు చేసిన ట్రాక్టర్ యజమానులు దానిని కూడా చూసి తెలియనట్లు నటిస్తున్న రెవెన్యూ అధికారులు. మండలంలో ఇంత జరుగుతున్న ఇప్పటి వరకు ఒక ట్రాక్టర్ కూడా పట్టుకొని జరిమానా విధించిన దాఖలాలు లేవు. మండలంలో తహసీల్దార్, ఇద్దరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ కార్యాలయంలో ఎస్ఐ , ఏఎస్ఐ సైతం అందుబాటులోనే ఉన్నారు. అదే ఇంటి అవసరాలకు సాధారణ ప్రజలు ఇసుక తరలిస్తే ట్రాక్టర్ యజమానులు ఇచ్చిన ఫిర్యాదుతో వాటిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజల కోరుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇసుక రవాణా, నిల్వలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ప్రతి ట్రాక్టర్ ట్రిప్పుకు 1800 రూపాయల డీడీ తప్పనిసరిగా తీసుకోవాలని లేనిచో పట్టుకొని శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఇసుక తరలించే పెద్దవాగు, బక్కి వాగు, ఉచ్చ మల్లి వాగులపై సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తాం.

- వెంకటేశ్వరరావు, తహసీల్దార్

పలు చోట్ల చెక్‌పోస్టుల ఏర్పాటు

గూడెం ప్రాణహిత సరిహద్దుల్లో చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ నరేశ్, అధికారులు

వాంకిడి : చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కల్వాడలో..

దహెగాం,మార్చి17 : మండలంలోని కల్వాడలో ఆదివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ చెక్ పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీలు చేపడుతామని, ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూడెం సమీపంలో..

చింతలమానేపల్లి, మార్చి 17: మండలంలోని గూడెం సమీపంలో గల సరిహద్దుల్లో ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది తిరుపతి, సంతోష్, పంచాయతీ రాజ్ సిబ్బంది ఉన్నారు.

శివ కేశవనగర్‌లో..

వాంకిడి, మార్చి17 : మండల కేంద్రంలోని శివ కేశవనగర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు చేశారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్,ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో ఉదయం 6గంటలకు చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మడావి బాబు భాస్కర్, ఏఎస్ఐ ఉత్తం, సిబ్బంది ఉన్నారు.

వార్డులో సమస్యలు పరిశీలిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

సమస్యలు పరిష్కరిస్తాం

కాగజ్‌నగర్, మార్చి 17: పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం కౌన్సిలర్లు పర్యటించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని చెత్త చెదారం, మంచినీటి పైపు లైను లీకేజీ సమస్యలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జయచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

కాగజ్‌నగర్, మార్చి 17: పట్టణంలోని న్యూ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప ఆలయం 22వ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృపతో అందరు సుభిక్షంగా, క్షేమంగా ఉం డాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి గురు స్వా మి బిక్షపతి, నాయకులు రాజన్న, వేద పండితులు ఉన్నారు.

అన్నదానం

మహంకాళి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, మార్చి 17: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో కొలువైన శ్రీ కనకదుర్గదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించి వోడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

పశువైద్య శిబిరం

రెబ్బెన, మార్చి 17: మండలంలోని సింగల్‌గూడలో ఆదివారం పశువైద్య శిబిరం నిర్వహించి 178 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి సాగర్ తెలిపారు. పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, పశు వైద్య సిబ్బంది ఉన్నారు.

సోలార్ విద్యుత్ తీగ తగిలి మహిళ మృతి

బెజ్జూర్, మార్చి 17 : మండలంలోని చిన్నసిద్ధాపూర్ గ్రామానికి చెందిన టాకిరె లక్ష్మీ (55) ఆదివారం సోలార్ విద్యుత్ తీగ తగిలి మృతి చెందినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీకి ఫిట్స్ ఉన్నందునా దాని ప్రభావం వచ్చినపుడు వణుకుతూ కింద పడిపోతుంది. ఈ క్రమంలోనే ఆదివారం లక్ష్మీ తన తోటలోకి కూరగాయలు కోయడానికి వెళ్లింది. ఈ క్రమంలోనే లక్ష్మీకి ఫీట్స్ వచ్చింది. దీంతో వణుకుతూ తోటకు రక్షణకోసం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ తీగకు తగలడంతో మృతి చెందింది. మృతురాలి భర్త సదాశివ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు బెజ్జూర్ ఎస్ఐ తెలిపారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నాం..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 16,44,715 మంది ఓటర్లు

2,111 పోలింగ్ కేంద్రాలు..

- ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం
- 85 ఏండ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు
- రూ.50 వేలకు మించి నగదు తీసుకుపోతే పత్రాలు తప్పనిసరి
- సీ-విజిల్, 1950, 8712659973 నంబర్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు
- సోషల్ మీడియాలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు పెడితే చర్యలు
- విలేకరుల సమావేశంలో ఎన్నికల అధికారి రాజర్షి షా

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, ఆదిలాబా ద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, మార్చి 17(నమస్తే తెలంగాణ) : కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) లోక్‌సభ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చే స్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, ఆదిలాబా ద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదివారం క లెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్, ప్రభు త్వ కార్యాలయాల్లో ఫొటోలను తొలిగిస్తున్న ట్లు పేర్కొన్నారు. ప్రచారం నిర్వహించే రాజకీయ పార్టీల నాయకులు ముందుగా అనుమ తి తీసుకోవాలని సూచించారు. అందరూ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రలోభాల కు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనల ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సోషల్ మీడియాలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టు లు పెట్టిన వారిపై చర్యలు ఉంటామని హెచ్చరించారు. ఇందుకోసం ఎంసీసీ, సర్వేలైన్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో సర్వేలైన్ బృందాలు, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్వహణకు పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉ న్నారని, అవసరమైన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అర్హులు ఓటరు జాబితాలో పేరు చూసుకోవాలని, పేరులేని వారు ఏప్రిల్ 15వ తేదీలోగా వివరాలను బీఎల్‌వోకు అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో 10 వేలకు పైగా కొత్త ఓటరు కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

16,44,715 మంది ఓటర్లు

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎస్టీ-1 కాగా.. మూడు జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఇందులో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, మథోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్ ఉండగా.. ఇందులో 16,44,715 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారి వివరించారు. పురుషులు 8,02,575.. మహిళలు, 8,42,054, ఇతరులు 86, 2,085 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 2,111 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మరో 80 ఆక్సిలరీ కేంద్రాలు కూడా ఉంటాయన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం 2 కిలోమీటర్ల పరిధిలో ఉంటుందని.. 85 ఏండ్లు దాటిన వృద్ధ ఓటర్లు, దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచి ఓటును వినియోగిచుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు మోడల్, ఐదు మహిళ, ఒక దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సరికొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ శాతం పెంచడానికి స్వీప్, ఇతర కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకుపోతే అందుకు అవసరమైన పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. నగదు సమస్యల పరిష్కారానికి జిల్లా సహకార శాఖ అధికారి మోహన్‌ను నోడల్ అధికారిగా నియమించామని, 8328683965 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

సరిహద్దుల్లో తనిఖీలు.. : ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఇందుకు ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, తనిఖీలను వీడియో రికార్డింగ్ చేస్తున్నామన్నారు. శాంతిభద్రతలు కాపాడడంతోపాటు ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్య లు తీసుకున్నామని, సీ-వీజిల్, డయల్-100, 1950 నంబర్ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రజలు 87126 59973 వాట్సాప్ నంబరుకు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు కేంద్ర బలగాలు కూడా వస్తాయని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.